మాకొద్దు ఈ ప్రైజ్‌మనీ

- ప్రోత్సాహం తిరస్కరించిన కర్నాటక ఖోఖో ప్రపంచకప్ ప్లేయర్లు
- మహారాష్ట్రను చూడండని హితవు

బెంగళూరు: అరంగేట్రం ఖో ఖో ప్రపంచకప్ గెలిచిన జట్టులో సభ్యులైన తమ రాష్ట్ర ప్లేయర్లకు ఇచ్చిన ప్రైజ్‌మనీపై కర్నాటక కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నది. ఇటీవలే ముగిసిన ఖో ఖో వరల్డ్‌కప్ టైటిల్ సాధించిన భారత జట్లలో సభ్యులైన ఎమ్‌కే గౌతమ్, చైత్రకు సీఎం సిద్ధరామయ్య 5 లక్షల చొప్పున నగదు ప్రోత్సాహకం ప్రకటించారు. దీనిపై అటు ప్లేయర్లతో పాటు ప్రతిపక్ష పార్టీలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాయి. ఇదే ప్రపంచకప్ గెలిచిన జట్టులో సభ్యులైన తమ ప్లేయర్లకు మహారాష్ట్ర ప్రభుత్వం 2.25కోట్ల ప్రైజ్‌మనీతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇస్తున్నట్లు ప్రకటించింది. అలాంటిది కర్నాటక ప్రభుత్వం తమకు ఏదో ముష్టి వేసినట్లు 5లక్షలు ఇచ్చి అవమాన పరిచిందని ప్లేయర్లు వాపోయారు. మహారాష్ట్ర ప్రభుత్వం అంత ఇవ్వకపోయినా కనీసం గుర్తింపు అయినా ఇవ్వాలని ప్లేయర్లు విజ్ఞప్తి చేస్తున్నారు. మీరిచ్చిన ప్రైజ్‌మనీ తమకు వద్దని వారు సున్నితంగా తిరస్కరించారు. దీనిపై అటు ప్రతిపక్షాలు కూడా ప్రభుత్వ తీరుపై విరుచుకుపడ్డాయి. ఇచ్చినప్పుడు తీసుకోవడం బెటర్ లేకపోతే ఇవి కూడా మళ్లీ దొరకవంటూ సెటెర్లు వేస్తున్నారు.

నేటి నుంచి నేషనల్ గేమ్స్

- 205 మందితో తెలంగాణ బరిలోకి

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ వేదికగా మంగళవారం 38వ జాతీయ క్రీడలకు అధికారికంగా తెరలేవనుంది. స్థానిక రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ప్రధాన నరేంద్రమోదీ చేతుల మీదుగా నేషనల్ గేమ్స్ మొదలుకానున్నాయి. 18 రోజుల పాటు జరుగునన్న టోర్నీలో మొత్తం 32 క్రీడాంశాల్లో దాదాపు 10వేల మంది ప్లేయర్లు పోటీ పడనున్నారు. రాష్ట్రంలోని ఏడు నగరాల్లో జరుగనున్న నేషనల్ గేమ్స్ పోటీలు జరుగనున్నాయి. 22 క్రీడాంశాల్లో 205 మందితో తెలంగాణ బరిలోకి దిగుతున్నది.

రాజ్‌కోట్‌లోనే ముగించాలని..

సిరీస్‌పై టీమ్‌ఇండియా కన్ను ● బట్లర్ సేన పుంజుకునేనా? ● సూర్య ఫామ్‌పై ఆందోళన ● నేడు భారత్, ఇంగ్లండ్ మూడో టీ20

రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో లైవ్

రాజ్‌కోట్: కుర్రాళ్ల అదిరిపోయే ప్రదర్శనలతో పటిష్టమైన ఇంగ్లండ్‌కు చుక్కలు చూపిస్తూ ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఇప్పటికే 2-0తో నిలిచిన యువ భారత జట్టు.. మంగళవారం మరో కీలక మ్యాచ్ ఆడనుంది. రాజ్‌కోట్ వేదికగా బట్లర్ సేనతో జరుగబోయే మూడో టీ20లో గెలిచి సిరీస్‌ను ఇక్కడే పట్టేయాలని టీమ్‌ఇండియా ఉవ్విళ్లూరుతోంది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో ప్రత్యర్థి కంటే మెరుగైన ప్రదర్శనలు చేస్తూ సిరీస్ ఆధిక్యంలో నిలిచిన యువ భారత్.. రాజ్‌కోట్‌లోనూ అదే ఊపును కొనసాగించాలనే వ్యూహంతో బరిలోకి దిగనుంది. మరోవైపు గత రెండు మ్యాచ్‌లలోనూ ఓడిన ఇంగ్లీష్ జట్టు.. మూడో టీ20లో అయినా పుంజుకుని సిరీస్ ఆశలు నిలబెట్టుకోవాలనే పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలో నిరంజన్ షా స్టేడియంలో అభిమానులను మరో ధనాధన్ పోరు ఉర్రూతలూగించడం ఖాయం!

కెప్టెన్ ఫామ్‌లోకి వచ్చేనా?

గతేడాది రోహిత్ శర్మ పొట్టి ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత భారత జట్టు పగ్గాలను అందుకున్న సూర్య.. కెప్టెన్ అయ్యాక స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతున్నాడు. సారథిగా జట్టుకు వరుస విజయాలను అందిస్తున్నా.. వ్యక్తిగతంగా అతడి ఫామ్ మాత్రం ఆందోళనకరంగా ఉంది. గత 17 ఇన్నింగ్స్‌లలో సూర్య.. 26.81 సగటుతో 429 పరుగులే చేశాడు. సూర్య కెరీర్‌లో ఇదే అత్యల్ప సగటు. తన కెరీర్ ఆరంభ ఏడాది (2021)లో కూడా అతడి సగటు 35గా నమోదు కాగా ఆ తర్వాత రెండేండ్లలో 45+గా ఉంది. గతేడాది అక్టోబర్‌లో బంగ్లాదేశ్‌తో హైదరాబాద్‌లో చేసిన హాఫ్ సెంచరీ తర్వాత అతడు మళ్లీ 30 పరుగుల మార్కును కూడా అందుకోలేదు. ఈ సిరీస్‌లో తొలి ఇన్నింగ్స్‌లో డకౌట్ అయిన సూర్య.. చెన్నై మ్యాచ్‌లో 12 పరుగులే చేశాడు. ఈ నేపథ్యంలో పరుగుల వరద పారే రాజ్‌కోట్‌లో అయినా మునపటి ఫామ్‌ను సంతరించుకోవాలని భారత్ ఆశిస్తోంది. సౌతాఫ్రికా సిరీస్‌లో వరుస సెంచరీలతో దుమ్మురేపిన సంజూ శాంసన్.. ఇంగ్లండ్‌తో రెండు మ్యాచ్‌లలోనూ షార్ట్ బాల్స్‌కు ఔట్ అయ్యాడు. రాజ్‌కోట్‌లో అతడు విజృంభిస్తే భారత్‌కు శుభారంభం దక్కడం ఖాయం. అభిషేక్ శర్మ, గత మ్యాచ్ హీరో తిలక్ వర్మ మంచి టచ్‌లో ఉన్నారు. రింకూ, నితీశ్ గాయాలతో దూరం కాగా, ఈ మ్యాచ్‌లో శివమ్ దూబే, రమణ్‌దీప్ సింగ్‌ను ఆడించే అవకాశాలున్నాయి.

గెలిస్తేనే.. నిలిచేది

జట్టు నిండా స్టార్లు, హిట్టర్లు ఉన్నప్పటికీ ఈ సిరీస్‌లో ఇంగ్లండ్ బ్యాటర్లలో కెప్టెన్ జోస్ బట్లర్ మినహా మిగిలిన వారంతా ఘోరంగా విఫలమవుతున్నారు. ఫిల్ సాల్ట్, బెన్ డకెట్, హ్యారీ బ్రూక్, లివింగ్‌స్టోన్ వంటి హిట్టర్లంతా తేలిపోతున్నారు. రాజ్‌కోట్‌లో ఆ జట్టుకు తప్పనిసరి గెలవాల్సిన పరిస్థితి. ఈ మ్యాచ్‌లోనూ ఓడితే ఇంగ్లీష్ జట్టు సిరీస్‌పై ఆశలు వదులుకోవాల్సిందే. ఆర్చర్, వుడ్, రషీద్ వంటి మేటి బౌలర్లు భారత కుర్రాళ్లను అడ్డుకోలేకపోతున్నారు. అన్ని రంగాలలో ఇబ్బందిపడుతున్న బట్లర్ గ్యాంగ్.. రాజ్‌కోట్‌లో ఏ మేరకు రాణిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

4 రాజ్‌కోట్‌లో భారత్ ఆడిన ఐదు టీ20ల్లో నాలుగింటిలో గెలిచింది. గత రెండు పర్యాయాలు 80 పరుగుల తేడాతో విజయం సాధించింది.

జట్ల అంచనా

భారత్: శాంసన్, అభిషేక్, తిలక్‌వర్మ, సూర్యకుమార్(కెప్టెన్), హార్దిక్, శివమ్, అక్షర్, సుందర్, బిష్ణోయ్, అర్ష్‌దీప్, చక్రవర్తి.

ఇంగ్లండ్: సాల్ట్, డకెట్, బట్లర్(కెప్టెన్), బ్రూక్, లివింగ్‌స్టోన్, స్మిత్, ఓవర్టన్, కార్స్, ఆర్చర్, వుడ్, రషీద్.

బుమ్రా.. టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్

- వన్డేలలో మంధానకు అవార్డు

దుబాయ్: టీమ్‌ఇండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా మరో ప్రతిష్టాత్మక అవార్డును సొంతం చేసుకున్నాడు. 2024కు గాను అతడు అత్యుత్తమ టెస్టు క్రికెటర్‌గా నిలిచాడు. ఈ అవార్డు రేసులో జో రూట్, హ్యారీ బ్రూక్ (ఇంగ్లండ్), కమిందు మెండిస్ (శ్రీలంక)ను వెనక్కినెట్టిన బుమ్రా.. అవార్డుకు ఎంపికైనట్టు ఐసీసీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. గతేడాది 13 టెస్టులాడిన బుమ్రా.. ఏకంగా 71 వికెట్లు పడగొట్టాడు. స్వదేశంలో ఇంగ్లండ్, బంగ్లాదేశ్‌ను బెంబేలెత్తించిన బుమ్రా.. కొద్దిరోజుల క్రితమే ఆస్ట్రేలియాలో కంగారూలను ముప్పుతిప్పలు పెట్టి 5 టెస్టుల్లో ఏకంగా 32 వికెట్లు పడగొట్టాడు. భారత్ నుంచి ఈ అవార్డు అందుకున్న క్రికెటర్లలో బుమ్రా ఆరో వ్యక్తి. గతంలో ద్రవిడ్, గంభీర్, సెహ్వాగ్, అశ్విన్, కోహ్లీ ఈ జాబితాలో ఉన్నారు. ఐసీసీ ఇటీవలే ప్రకటించిన అత్యుత్తమ టెస్టు క్రికెట్ జట్టులో చోటు దక్కించుకున్న బుమ్రా.. తాజాగా అదే ఫార్మాట్లో బెస్ట్ క్రికెటర్‌గా నిలిచాడు. అంతేగాక అతడు 'క్రికెటర్ ఆఫ్ ది ఇయర్' రేసులోనూ ఉన్నాడు. మంగళవారం ఆ ఫలితాలు వెలువడాల్సి ఉంది.

మంధానకు డబుల్ బొనాంజా

మహిళల విభాగంలో ఓపెనర్ స్మృతి మంధాన.. అత్యుత్తమ వన్డే క్రికెటర్‌గా నిలిచింది. 2024లో ఆమె 13 ఇన్నింగ్స్‌లలో 747 పరుగులు సాధించింది. మంధాన ఇదివరకే ఐసీసీ ఉమెన్స్ టీ20 జట్టులో స్థానం సంపాదించుకున్న విషయం విదితమే. పురుషుల విభాగంలో అత్యుత్తమ వన్డే క్రికెటర్‌గా అఫ్గానిస్థాన్ క్రికెటర్ అజ్మతుల్లా ఒమర్‌జాయ్ ఎంపికయ్యాడు.

34 ఏండ్ల తర్వాత..

పాకిస్థాన్ గడ్డపై వెస్టిండీస్ విజయం ● టెస్టు సిరీస్ 1-1తో సమం

ముల్తాన్: సుదీర్ఘ విరామం తర్వాత పాకిస్థాన్‌లో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడిన వెస్టిండీస్.. తొలి టెస్టులో ఓడినా రెండో టెస్టులో అదరగొట్టింది. ముల్తాన్ వేదికగా మూడు రోజుల్లో ముగిసిన చివరి టెస్టులో ఆతిథ్య జట్టు ఎదుట 254 పరుగుల లక్ష్యాన్ని నిలిపిన విండీస్.. మూడో రోజు పాక్‌ను 133 పరుగులకే కుప్పకూల్చి 120 రన్స్ తేడాతో ఘన విజయం సాధించింది. తద్వారా సిరీస్‌ను 1-1తో సమం చేసింది. ఈ క్రమంలో 34 ఏండ్ల సుదీర్ఘ విరామం తర్వాత పాక్ గడ్డపై విండీస్ టెస్టు మ్యాచ్ గెలువడం విశేషం. ఓవర్‌నైట్ స్కోరు 76/4తో మూడో రోజు క్రీజులోకి వచ్చిన షాన్ మసూద్ సేన.. విండీస్ లెఫ్టార్మ్ స్పిన్నర్ జొమెల్ వారికన్ (5/27) స్పిన్‌కు విలవిల్లాడింది. అతడితో పాటు సింక్లెయిర్ (3/61) రాణించాడు. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (2023-25) లో ఇరు జట్లకూ ఇదే చివరి టెస్టు కాగా ఈ ఓటమితో పాకిస్థాన్.. డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో నిలిచింది.

బిగ్‌బాష్ లీగ్ విజేత హోబర్ట్ హరికేన్స్

హోబర్ట్: ఆస్ట్రేలియాలో జరిగే బిగ్‌బాష్ లీగ్ (బీబీఎల్) 2024-25 సీజన్ ట్రోఫీని హోబర్ట్ హరికేన్స్ సొంతం చేసుకుంది. సోమవారం జరిగిన ఫైనల్‌లో ఆ జట్టు సిడ్నీ థండర్స్‌ను 7 వికెట్ల తేడాతో ఓడించింది. హోబర్ట్‌కు బీబీఎల్‌లో ఇదే తొలి టైటిల్ కావడం విశేషం. మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన సిడ్నీ.. 20 ఓవర్లకు 182/7 స్కోరు చేసింది. ఛేదనను హోబర్ట్ 14.1 ఓవర్లలోనే పూర్తిచేసింది. ఓపెనర్ మిచెల్ ఒవెన్ (42 బంతుల్లో 108, 6 ఫోర్లు, 11 సిక్సర్లు) వీరవిధ్వంసంతో ఆ జట్టు ఘనవిజయాన్ని అందుకుంది.

దేశవాళీకి కోహ్లీ సిద్ధం!

నేడు ఢిల్లీ జట్టుతో చేరే అవకాశం

ముంబై: దేశవాళీలలో పుష్కరకాల సుదీర్ఘ విరామానికి పరుగుల వీరుడు విరాట్ కోహ్లీ త్వరలోనే తెరదించనున్నాడు. ఇటీవల పేలవ ఫామ్‌తో సర్వత్రా విమర్శలను ఎదుర్కొంటున్న కోహ్లీ.. మరో రెండ్రోజుల్లో రంజీ మ్యాచ్ ఆడేందుకు అంతా సిద్ధమవుతున్నాడు. 2012లో చివరిసారిగా దేశవాళీల్లో ఆడిన కోహ్లీ.. ఈనెల 30 నుంచి రైల్వేస్‌తో జరుగబోయే మ్యాచ్‌లో ఢిల్లీ తరపున ఆడేందుకు సుముఖత వ్యక్తం చేశాడు. మంగళవారం అతడు ఢిల్లీ జట్టుతో కలిసి ప్రాక్టీస్ చేసే అవకాశముందని కోచ్ శరణ్‌దీప్ సింగ్ స్పష్టం చేశాడు. దేశవాళీకి రీఎంట్రీలో భాగంగా కొంతకాలంగా తనను వేధిస్తున్న బ్యాక్‌పుట్, ఆఫ్ సైడ్ ఆఫ్ స్టంప్ బలహీనతల నుంచి బయటపడేందుకు గాను విరాట్.. ఆర్సీబీ మాజీ కోచ్ సంజయ్ బంగర్ సలహాలతో ప్రాక్టీస్ చేస్తున్న ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్ అయ్యాయి. సోమవారం కూడా కోహ్లీ.. ముంబైకి సమీపంలో ఉన్న అలీభాగ్ వద్ద బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు.

టీడీసీఏ టోర్నీ షురూ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కల్గిన ప్లేయర్లను ప్రోత్సహించేందుకు తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం(టీడీసీఏ) అండర్-17 టోర్నీ సోమవారం అట్టహాసంగా మొదలైంది. సాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, రాజేందర్ రెడ్డి, టీడీసీఏ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి టోర్నీని ప్రారంభించారు. దోమలగూడ ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజ్ గ్రౌండ్‌లో మొదలైన ఈ టోర్నీ ద్వారా మెరికల్లాంటి క్రికెటర్లను గుర్తించనున్నారు. ఉమ్మడి తొమ్మిది జిల్లాలకు చెందిన టీమ్‌లతో పాటు టీడీసీఏ-లెవెన్ ఈ టోర్నీలో పోటీపడుతున్నాయి. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 'తెలంగాణలో గ్రామీణ క్రికెటర్లకు సరైన అవకాశాలు లభించడం లేదు. రాష్ట్రంలో జిల్లాల క్రికెట్ అభివృద్ధికి బీసీసీఐ గుర్తింపు కోసం ప్రయత్నాలు చేస్తున్నాం. ఈ టోర్నీలో సత్తాచాటిన వారిని ఎంపిక చేసి అమెరికా క్రికెట్ అకాడమీ టీమ్‌తో మ్యాచ్‌లు ఏర్పాటు చేస్తాం' అని అన్నారు.

మళ్లీ సంక్రాంతి కొస్తాం..

హిట్ కొడతాం!

'మంచి హిట్ సినిమా చేస్తున్నామని అనుకున్నాం..కానీ మీరందరూ ట్రిపుల్ బ్లాక్‌బస్టర్ హిట్ చేశారు. ఎక్కడకు వెళ్లినా అందరూ అద్భుతమైన ప్రేమను చూపిస్తున్నారు' అని అన్నారు అగ్ర నటుడు వెంకటేష్. ఆయన కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో దిల్‌రాజు, శిరీష్ నిర్మించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం ఇటీవలే విడుదలై విజయపథంలో పయనిస్తున్నది. ఆదివారం ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరంలో బ్లాక్‌బస్టర్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ 'ఈ సినిమాకు రెండొందలు, మూడొందల కలెక్షన్స్ అని చెబుతున్నారు. ఇవన్నీ మీరిచ్చినవే. మీ ప్రేమ ఇలాగే ఉంటే మళ్లీ సంక్రాంతికి వస్తాం. మరో బ్లాక్‌బస్టర్ కొడతాం' అన్నారు. తాను వెంకటేష్‌కు అభిమానినని, ఆయన సినిమాకు విజిల్స్ వేశానని, ఇప్పుడు ఆయన్ని డైరెక్ట్ చేయడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని దర్శకుడు అనిల్ రావిపూడి పేర్కొన్నారు. టీమ్ అందరి సమిష్టికృషి వల్లే ఈ విజయం సాధ్యమైందని నిర్మాత శిరీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కథానాయికలు ఐశ్వర్యరాజేష్, మీనాక్షి చౌదరి, సంగీత దర్శకుడు భీమ్స్‌తో పాటు చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

వివాదాల్లో 'ఛావా' ట్రైలర్

డ్యాన్స్ సీక్వెన్స్ తీసివేస్తామన్న దర్శకుడు

మరాఠీ యోధుడు ఛత్రపతి శంభాజీ జీవిత కథ ఆధారంగా విక్కీ కౌశల్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటించిన 'ఛావా' చిత్రం వివాదాల్లో చిక్కుకుంది. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్‌లో శంభాజీ మహారాజ్ నృత్యం చేస్తున్నట్లుగా చూపించారని మహారాష్ట్రకు చెందిన పలువురు మంత్రులు, మేధావుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ సన్నివేశంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సైతం అభ్యంతరం వ్యక్తం చేశారు. మహారాష్ట్ర చారిత్రక యోధుడు శంభాజీ ఘన వారసత్వాన్ని గౌరవించాలని, ఆయన చరిత్రను వక్రీకరించొద్దని, సున్నితమైన అంశాల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆయన కోరారు. ఈ నేపథ్యంలో చిత్ర దర్శకుడు లక్ష్మణ్ ఊటేకర్ వివాదస్పద నృత్యంపై వివరణ ఇచ్చారు. ఛత్రపతి శంభాజీ 20ఏళ్ల వయసులో యుద్ధాన్ని గెలిచి వచ్చిన సందర్భంలో ఆయన నృత్యం చేస్తున్నట్లు చూపించామని, 'ఛావా' అనే పుస్తకంలో రాసిన విధంగానే తాము ఆ సన్నివేశాన్ని తెరకెక్కించామని తెలిపారు. ''లెయిమ్' అనే నృత్యం మహారాష్ట్ర సంస్కృతిలో భాగం. అందుకే ఆ సన్నివేశాలను చిత్రీకరించాం. అయితే అందరి అభిప్రాయాలను గౌరవిస్తూ ఆ డ్యాన్స్ సీక్వెన్స్‌ను సినిమా నుంచి తీసివేయబోతున్నాం. చరిత్రకారులకు ఈ నెల 29న సినిమాను ప్రదర్శించి వారి సలహాలు, సూచనలు తీసుకొని సినిమాలో మార్పులు చేస్తాం' అని లక్ష్మణ్ ఊటేకర్ పేర్కొన్నారు. దీంతో ఈ వివాదానికి తెరపడ్డట్లయింది. ఈ చిత్రంలో శంభాజీ మహారాజ్ భార్య యేసుబాయిగా రష్మిక మందన్న నటించింది. ఈ సినిమా ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకురానుంది.

డాన్ ఖురేషి అబ్రామ్

మలయాళ అగ్ర కథానాయకుడు మోహన్‌లాల్ నటిస్తున్న తాజా చిత్రం 'లూసిఫర్-2: ఎంపురాన్'. 2019లో వచ్చిన 'లూసిఫర్' చిత్రానికి సీక్వెల్ ఇది. పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్నది. మార్చి 27న పాన్ ఇండియా స్థాయిలో విడుదలకానుంది. సోమవారం టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో డాన్ ఖురేషి అబ్రామ్‌గా మోహన్‌లాల్‌ను పవర్‌ఫుల్‌గా ప్రజెంట్ చేశారు. 'ఈ యుద్ధం మంచికి చెడుకి కాదు ..చెడుకి చెడుకీ మధ్య..' వంటి డైలాగ్స్ సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉన్నాయి. 'లూసిఫర్' సినిమా కంటే గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లే, రోమాంచితమైన యాక్షన్ ఘట్టాలతో ఈ సినిమాను తెరకెక్కించామని, మోహన్‌లాల్ పాత్ర అత్యంత శక్తివంతంగా సాగుతుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రంలో టోవినో థామస్, మంజు వారియర్, నందు, సానియా అయ్యప్పన్ తదితరులు నటించారు.

గ్రామంలో ఆటపాటలు

ప్రముఖ హాస్య నటుడు బ్రహ్మానందం ప్రధాన పాత్రలో ఆయన తనయుడు రాజా గౌతమ్‌తో కలిసి నటించిన చిత్రం 'బ్రహ్మ ఆనందం'. ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హోలక్కల్ కీలక పాత్రల్ని పోషించారు. ఆర్‌వీఎస్ నిఖిల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రాహుల్ యాదవ్ నక్కా నిర్మించారు. ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్‌ను వేగవంతం చేశారు. సోమవారం 'విలేజ్ సాంగ్' అనే రెండో గీతాన్ని అగ్ర సంగీత దర్శకుడు కీరవాణి విడుదల చేశారు. శాండిల్య స్వరపరచిన ఈ పాటకు సురేష్ బనిశెట్టి సాహిత్యాన్నందించారు. గ్రామీణ అందాలు, అక్కడి ఆటపాటలు, వినోదంతో ఈ పాట మెప్పించింది. ఈ చిత్రంలో బ్రహ్మానందం, రాజా గౌతమ్ తాతామనవళ్లుగా నటిస్తున్నారు. వెన్నెల కిషోర్, సంపత్‌రాజ్, రాజీవ్ కనకాల తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: శాండిల్య పిసపాటి, దర్శకత్వం: ఆర్‌వీఎస్ నిఖిల్.

ప్రతీకార నేపథ్యంలో 'రాచరికం'

అప్సరా రాణి, వరుణ్‌సందేశ్, విజయ్ శంకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రాచరికం'. సురేష్ లంకలపల్లి దర్శకుడు. ఈశ్వర్ నిర్మాత. ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకురానుంది. ఆదివారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. వందకోట్లతో తీసిన భారీ సినిమా తరహాలో మేకింగ్‌పరంగా అద్భుతంగా వచ్చిందని, రాయలసీమ నేపథ్యంలో ప్రతీకార కథగా ఆకట్టుకుంటుందని దర్శకుడు తెలిపారు. ఈ సినిమాలో తాను నెగెటివ్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్ చేశానని వరుణ్ సందేశ్ పేర్కొన్నారు. మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ హైలైట్‌గా నిలుస్తాయని హీరో విజయ్ శంకర్ అన్నారు. కొత్త కంటెంట్‌తో మంచి క్వాలిటీతో సినిమా తీశామని నిర్మాత ఈశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

చిత్రం

'కన్నప్ప'లో నందీశ్వరుడు?

'కన్నప్ప' చిత్రంలో అగ్ర హీరో ప్రభాస్ కీలక పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. మంచు విష్ణు టైటిల్ రోల్‌ని పోషిస్తున్న ఈ సినిమాలో వివిధ భాషలకు చెందిన అగ్ర తారలు భాగమవుతున్నారు. శివపార్వతులుగా అక్షయ్‌కుమార్, కాజల్ అగర్వాల్ కనిపించనున్నారు. ఇటీవల రిలీజ్ చేసిన వారిద్దరి పాత్రల తాలూకు ఫస్ట్‌లుక్ పోస్టర్స్‌కు మంచి స్పందన లభించింది. దాంతో సినిమాలో ప్రభాస్ పాత్ర విశేషాలతో పాటు ఆయన ఫస్ట్ లుక్ ఎలా ఉంటుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఫిబ్రవరి 3న ప్రభాస్ ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేయబోతున్నామని మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. అయితే ఇందులో ప్రభాస్ పాత్ర గురించి ఎలాంటి వివరాలను వెల్లడించలేదు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ సినిమాలో ప్రభాస్..మానవరూపంలో కనిపించే నందీశ్వరుడి పాత్రను పోషించారని తెలిసింది. ఆయన పాత్ర నిడివి కూడా ఎక్కువగానే ఉంటుందని చెబుతున్నారు. ఈ వార్తలపై స్పష్టత రావాలంటే ఫిబ్రవరి 3 వరకు వేచి చూడాల్సిందే. ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మంచు మోహన్‌బాబు భారీ వ్యయంతో నిర్మిస్తున్నారు.

ధనుష్‌తో బాలీవుడ్ చిత్రం

సినిమాల విషయంలో చాలా సెలెక్టివ్‌గా ఉంటుంది బాలీవుడ్ నాయిక కృతిసనన్. జయాపజయాలకు అతీతంగా గత కొన్నేళ్లుగా చాలెంజింగ్ రోల్స్‌కి ప్రాధాన్యం ఇస్తున్నది. తాజాగా ఈ భామ బాలీవుడ్‌లో మరో భారీ చిత్రంలో నాయికగా నటిస్తున్నదని తెలిసింది. వివరాల్లోకి వెళితే.. ధనుష్ కథానాయకుడిగా ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వంలో వచ్చిన 'రాన్‌జనా' (2013) చిత్రం హృద్యమైన ప్రేమకథగా ఆకట్టుకుంది. తాజాగా వీరిద్దరి కాంబినేషన్‌లో 'తేరే ఇష్క్ మే' పేరుతో మరో లవ్‌స్టోరీ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. టీ సిరీస్ పతాకంపై భూషణ్ కుమార్ నిర్మిస్తున్నారు. అయితే ఈ సినిమాలో కథానాయిక ఎవరనే విషయాన్ని ఇప్పటివరకూ వెల్లడించలేదు. ఆదివారం సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో బ్యాక్‌గ్రౌండ్‌లో వచ్చే ఓ మహిళ వాయిస్‌ను బట్టి అది కృతిసనన్‌దేనని అభిమానులు నిర్ధారణకు వచ్చారు. దాంతో ఈ సినిమాలో ఆమె కథానాయికగా నటిస్తున్నదని సోషల్‌మీడియాలో ప్రచారం మొదలైంది. త్వరలో ఈ విషయంపై అధికారిక ప్రకటన వెలువడుతుందని చెబుతున్నారు.

'బద్మాషులు' పంచే వినోదం

మహేష్ చింతల, విద్యాసాగర్, మురళీధర్ గౌడ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న కామెడీ ఎంటర్‌టైనర్ 'బద్మాషులు'. శంకర్ చేగూరి దర్శకుడు. బి.బాలకృష్ణ, సి.రామశంకర్ నిర్మాతలు. సోమవారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'గ్రామీణ నేపథ్యంలో సాగే హాస్యభరిత చిత్రమిది. ప్రతి సన్నివేశం కడుపుబ్బా నవ్విస్తుంది. ప్రతీ పాత్ర నిజజీవితంలో ఎక్కడో చూసినట్టే అనిపిస్తూ చక్కటి వినోదాన్ని పంచుతుంది. కథాపరంగా సందేశం కూడా ఉంటుంది' అన్నారు. బలగం సుధాకర్ రెడ్డి, కవిత శ్రీరంగం తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: వినీత్ పబ్బతి, సంగీతం: తేజ కూనూరు, దర్శకత్వం: శంకర్ చేగూరి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.